సాక్షి
వికారాబాద్
బుధవారం ı 10 ı జూలై ı 2024



వ్యవసాయం మరింత పిరం

వ్యవసాయ పనులు చేపట్టాలంటే.. రైతు నేస్తాలైన కాడెద్దు తప్పనిసరి. కానీ.. వాటి పోషణ భారంగా మారుతోంది. 10లో▸



సమాచారం ఇవ్వండి

దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఊరెళ్లేవారు పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. 10లో▸



డెంగీతో బాలుడి మృతి

డెంగీ బారిన పడిన తమ బిడ్డ వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. 10లో▸

న్యూస్‌రీల్

స్వచ్ఛత పుస్తకంలో 'కంతి లక్ష్మి'


Stories of Women Transforming India's Sanitation
Kanthilakshmi

కేంద్ర ప్రభుత్వం ముద్రించిన పుస్తకంలో కంతి లక్ష్మి వ్యాసం

దుద్యాల్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముద్రించిన స్వచ్ఛత శక్తి పుస్తకంలో హస్నాబాద్ పంచాయతీ కార్మికురాలు కంతి లక్ష్మి ఫొటోతో వ్యాసం ప్రచురించారు. జాతీయ స్థాయి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికైన ఆమె ఇటీవలే ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో పుస్తకంలోని 61వ పేజీలో లక్ష్మి మాటలతో కూడిన కథనాన్ని ముద్రించారు. ఇది చూసిన కార్మికురాలు సంతోషం వ్యక్తం చేశారు.


ప్రధాని మోదీతో కంతి లక్ష్మి(ఫైల్)

ఒత్తిడికి లోనుకాకండి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో పోలీసులు ఒత్తిడికి గురి కారాదని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏఆర్ పోలీసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో.. క్రమ శిక్షణ.. ఓపికతో విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సక్రమంగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక బాక్స్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం హెడ్ క్వార్టర్స్‌లోని స్టోర్ రూమ్, ఆర్‌ఐ కార్యాలయం, డ్యూటీ ఆఫీసర్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ మురళీధర్, ఆర్‌ఐలు అంజాద్ పాషా, డేవిడ్, విజయకుమార్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు ప్రభుత్వం అండ

రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి

ఇబ్రహీంపట్నం రూరల్: పోలీసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి అన్నారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి డిసెంబర్ 23న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ మేరకు తరుణ్‌జోషి మంగళవారం ఆయన భార్య మమత, కుమారుడు సుజిత్‌కు కమిషనర్ రూ.7,96,745లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హాస్టళ్లలో వసతులు కల్పించండి

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

తుర్కయంజాల్: జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డీటీడీఓ రాజేశ్వరిదేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కడ్తాల్, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని ఆరోపించారు. మెనూ ప్రకారం భోజనం అందజేయాలని.. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కల్తీ వైన్ తయారీ.. మహిళ అరెస్టు

ముషీరాబాద్: ఇంట్లో కల్తీ వైన్ తయారు చేసి విక్రయిస్తున్న మహిళను మంగళవారం ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తెలిపిన ప్రకారం.. లాలాగూడ, విజయపురి కాలనీకి చెందిన గెరాల్డింగ్ మిల్స్ గృహిణి. తన ఇంట్లో ద్రాక్ష పండ్లు, చక్కెరతో కల్తీ వైన్ తయారు చేస్తూ వాటిని లీటర్, రెండు లీటర్ల బాటిళ్లలో నింపి విక్రయిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం ఆమె ఇంటిపై దాడి చేసి తనిఖీలు నిర్వహించగా 112బాటిళ్లలో నింపిన 90 లీటర్ల కల్తీ వైన్‌ను పట్టుకున్నారు. వైన్‌ను నింపడానికి సిద్ధంగా ఉన్న ఖాళీ బాటిల్స్‌ను సీజ్ చేశారు.

మీనమేషాలు

చేప పిల్లల పంపిణీపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం


గత ఏడాది చెరువులో చేప పిల్లలు వదులుతున్న అధికారులు(ఫైల్)

- గత ఏడాది జూన్ మాసంలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి
- ఆ వెంటనే రెండు కోట్ల పిల్లల పంపిణీ
- అదును దాటాక వదిలితే ఎదుగుదల ఉండదంటున్న మత్స్యకారులు
- జిల్లాలో చెరువులు, కుంటలు 830, రిజర్వాయర్లు 16
- మత్స్యకార సంఘాలు 133

పరిగి: మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటునందించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మత్స్య పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రతిఏటా ఉచిత చేప పిల్లల పంపిణీకి సంబంధించి జూలై మాసంలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసేవారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. దీంతో పథకం కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చేప పిల్లలను ఆలస్యంగా చెరువులు, రిజర్వాయర్లలో వదిలితే వాటి ఎదుగుదలపై ప్రభావం పడుతుందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం 2017లో మత్స్య పథకాన్ని ప్రారంభించింది.



ఇప్పటి వరకు ఏడు విడతల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ఎనిమిదో విడత కోసం మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్య శాఖకు నిధులు కేటాయించకపోవడంతో అధికారులు చేప పిల్లల పంపిణీపై మత్స్యకార సంఘాలతో ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదు. వారం రోజుల్లో ఉన్నత స్థాయి అధికారుల సమావేశం ఉన్నందున చేప పిల్లల పంపిణీపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఏటా 846 చెరువుల్లో చేపల పెంపకం

నీటి వసతి కలిగిన చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదిలేందుకు జూలై మాసంలోనే ప్రణాళికను సిద్ధం చేస్తారు. పిల్లల సరఫరాకు, టెండర్ల ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. జిల్లా వ్యాప్తంగా 830 చెరువులు, కుంటలు, 16 ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో ప్రతి ఏటా చేప పిల్లలను వదులుతారు. జిల్లా వ్యాప్తంగా 133 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. వీరికి ఉపాధి కల్పించేందుకు రహూ, బొచ్చ, బంగారు తీగ వంటి చేప పిల్లలను వదులుతారు. గత సంవత్సరం 35 ఎంఎం నుంచి 45 ఎంఎం గల చేప పిల్లలను 1.04 కోట్లు, 80 ఎంఎం నుంచి 100 ఎంఎం చేప పిల్లలను 25 లక్షలు కలిపి మొత్తం 1.29 కోట్ల చేప పిల్లలను చెరువుల్లో వదిలారు.

గతేడాది నాసిరకం పిల్లలు

గతంలో చేప పిల్లల పంపిణీలో పలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. సకాలంలో పంపిణీ చేయకపోవడంతో ఎదుగుదల లేక మత్స్యకారులకు నష్టం జరిగింది. అధికారులు నాణ్యత పరిమాణం లేని చేప పిల్లలను చెరువుల్లో వదిలి చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలకు మత్స్యశాఖ అధికారులు మత్స్యకారుల నుంచి వేల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. డబ్బులు తీసుకున్నా నాసిరకం, తక్కువ పిల్లలను ఇచ్చారని, దీంతో తాము పూర్తిగా నష్టపోయామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెండర్ సమయంలో అధికారులు ఏజెన్సీ నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకొని వారి సరఫరా చేసే నాసిరకం పిల్లలను చెరువుల్లో వదులుతున్నారని ఆరోపించారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ ఏడాది జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

వెంటనే పంపిణీ చేయాలి



గత ప్రభుత్వం తరహాలో ఈ ఏడు కూడా చేప పిల్లలను పంపిణీ చేయాలి.చాలా మంది మత్స్యకారులు చెరువులపై ఆధారపడి జీవిస్తున్నారు. సకాలంలో పిల్లలను వదలక పోతే వాటి ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. దిగుబడి వచ్చే అవకాశం ఉండదు. చేప పిల్లల పంపిణీకి ఇదే అనువైన సమయం. ప్రభుత్వం వెంటనే ప్రక్రియను ప్రారంభించాలి.

– రామయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, ఇప్పాయిపల్లి

ఆదేశాలు రావాల్సి ఉంది

చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఒకటి రెండు రోజుల్లో పూర్తి సమాచారం తెలుస్తుంది. ఉన్నత అధికారులతో సమావేశంలో చేప పిల్లల పంపిణీపై స్పష్టత వస్తుంది. ఆ వెంటనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి చెరువుల్లో చేప పిల్లలను వదిలే ప్రక్రియను ప్రారంభిస్తాం.

– సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి


ధరణి పెండింగ్ ఫైళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

3గంటల్లో.. ఏడాది ఫైళ్లు క్లియర్

యుద్ధప్రాతిపదికన 2022 ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం

- కదిలివచ్చిన కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీఓ
- గంటల వ్యవధిలో ప్రక్రియ పూర్తి

ధారూరు: కార్యదీక్ష ఉంటే కానిదంటూ ఉండదని కలెక్టర్ ప్రతీక్‌జైన్ నిరూపించారు. కేవలం 3 గంటల్లోనే మండలంలోని 2022 సంవత్సరానికి సంబంధించిన ధరణి పెండింగ్ ఫైల్స్ మొత్తం క్లియర్ చేశారు. మంగళవారం ఉదయం 10.30గంటలకు అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర తమ సిబ్బంది, ల్యాప్ టాప్‌లతో ధారూరు చేరుకున్నారు. 11గంటలకు కలెక్టర్ వచ్చారు. మొదట తహసీల్దార్ సాజిదాబేగం, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత ధరణి 2022 పెండింగ్ సమస్యపై దృష్టి సారించారు. సక్సేషన్, మ్యుటేషన్, టీఎం– 33 సమస్యలను చకాచకా క్లియర్ చేశారు. కేవలం గంటల వ్యవధిలో ధరణి ఏడాది పెండింగ్ ఫైల్స్ మొత్తం క్లియర్ కావడం కలెక్టర్ పనితీరుకు అద్దం పడుతోంది. అనంతరం 2023కు సంబంధించి 465 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. అనుమానం వచ్చే వాటిని రీ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫైళ్లు పెండింగ్‌లో ఉంచొద్దని తెలిపారు. ధరణికి సంబంధించిన భూ సమస్యలు, ఇతర రెవెన్యూ ఫైళ్లపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.

'అమ్మ ఆదర్శ' పనులపై ఆరా

మండలంలో ఎంపిక చేసిన 47 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్ ఆరా తీశారు. పనులు ఏయే దశలో ఉన్నాయో ఎంపీడీఓ నర్సింహులును అడిగి తెలుసుకున్నారు. 42 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, మరో 5 చోట్ల పనులు జరుగుతున్నాయని ఎంపీడీఓ వివరించారు. నాగారం చెరువు వద్ద పడిపోయిన చెట్టును తొలగించామని కలెక్టర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

రాంపూర్‌తండా రైతుల ఫిర్యాదు

తాము సాగులో ఉన్న 73 భూములను గత తహసీల్దార్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని, అభ్యంతరం తెలిపితే ఆ సర్వే నంబర్లను బ్లాక్‌లో పెట్టినట్లు చెప్పి.. తర్వాత ఇతరుల పేరిట పట్టా పాసు పుస్తకాలు ఇచ్చారని గిరిజన రైతులు కలెక్టర్ ముందు వాపోయారు. ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేయాలని వారు కోరారు. స్పందించిన కలెక్టర్ వీటిపై విచారణ జరపాలని తహసీల్దార్‌కు సూచించారు.

భూ సమస్యలపై ఫిర్యాదు

భూ సమస్యలపై కొంతమంది రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మూడు దశాబ్దాలుగా తాము సేద్యం చేసుకుంటూ బతుకుతున్నామని, 2016 వరకు పట్టా పాసు పుస్తకం సరిగ్గా ఉందని.. ధరణి యాప్ రాగానే తమ భూమి ఇరిగేషన్ ప్రాజెక్టుకు చెందినది నమోదు చేశారని నాగసమందర్ రైతు సంగప్ప కొడుకు ప్రకాశ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ సర్వే నంబర్లు 75/3/అ లో తమకు 24 గుంటల భూమి ఉందని తెలిపారు. ధరణి రికార్డుల్లో మాత్రం ఆ భూమి ఇరిగేషన్ ప్రాజెక్టుగా తప్పుగా నమోదు చేశారని వివరించారు. దీన్ని సరిచేయాలని మార్చి 16న మీసేవలో దరఖాస్తు చేసినా రికార్డులు సరి చేయలేరని ఆయన వాపోయారు.


గనుల శాఖ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న అసోషియేషన్ ప్రతినిధులు

నాపరాతి పరిశ్రమకు త్వరలో మంచి రోజులు

- గనుల శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్
- స్టోన్, క్వారీ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులకు భరోసా
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో అధికారుల సమీక్ష

తాండూరు: తాండూరు ప్రాంతంలోని నాపరాతి పరిశ్రమకు త్వరలో మంచి రోజులు వస్తాయని గనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ పేర్కొన్నారు. తాండూరు స్టోన్ అండ్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. తాండూరు నాపరాతి పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని తొలగించాలని గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఖనిజ నిక్షేపాలపై సమీక్షించేందుకు అసోషియేషన్ ప్రతినిధులను ఆహ్వానించారు. రెండు గంటల పాటు సాగిన సమావేశంలో అసోషియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గనుల నుంచి తరలించే నాపరాయికి కర్ణాటకలో రూ.800 మాత్రమే వసూలు చేస్తారని.. ఇక్కడ రూ.2,800 వసూలు చేస్తుండటంతో నష్టపోతున్నామని తెలిపారు. దీంతో తాండూరులోని పరిశ్రమలు కర్ణాటకకు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నాపరాతి పరిశ్రమ అభివృద్ధి చేసేందుకు సబ్సిడీల ద్వారా యంత్రాలను అందించాలని కోరారు. సుద్ద (తెల్ల మట్టి) గనులకు సైతం ఇబ్బందులు లేకుండా అనుమతులు ఇవ్వాలన్నారు. త్వరలోనే గనుల శాఖ నుంచి ప్రత్యేక బృందం తాండూరులో పర్యటించి సర్వే చేస్తారని అధికారులు తెలిపారు. సమావేశంలో క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, స్టోన్ మర్చంట్ అసోషియేషన్ అధ్యక్షుడు నయిం, సంఘం ప్రతినిధులు జుబేర్‌లాల, నర్సింహులు, ఫయాజ్, కన్వర్, సంజీవ్, జయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్'

గచ్చిబౌలి: కేన్సర్ అవేర్‌నెస్‌లో భాగంగా 130కి పైగా దేశాల నుంచి లక్ష మంది ప్రజలు పాల్గొనే ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్-2024 ఏడో ఎడిషన్‌ను బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, క్యాంబియంట్ డెవలపర్స్ ఆధ్వర్యంలో నేటి మధ్యాహ్నం 3 గంటలకు సైబరాబాద్ కమిషనరేట్ వద్ద సీపీ అవినాష్ మహంతి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సుంకవల్లి పాల్గొంటారు.

సీనియర్లకు శరాఘాతం

- నాటి తప్పిదాలతో నేడు ఇతర జిల్లాలకు సీనియర్ లెక్చరర్లు
- గతేడాది 69మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిన గత సర్కార్
- ఉన్నచోటే పోస్టింగులు
- నేడు ఖాళీలు లేక సీనియర్ల పాట్లు
- జిల్లాలో 84 జూనియర్ కళాశాలలు
- కొత్త కళాశాలలకు మంజూరు కాని పోస్టులు


పరిగి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

వికారాబాద్: ఏడాది క్రితం జరిగిన తప్పిదాల కారణంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల సీనియర్ లెక్చరర్లు ఇతర జిల్లాల బాట పట్టాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న బదిలీల ప్రక్రియ వారికి ప్రతిబంధకంగా మారింది. గతంలో జరిగిన బదిలీలు, కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియలో నిబంధనలు పాటించకపోవడంతో నేడు సీనియర్లకు అన్యాయం జరుగుతోంది. గతేడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న 69 మంది లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిన విషయం తెలిసిందే. సాధారణంగా రెగ్యులరైజ్ చేసిన సమయంలో ఉద్యోగులను మరో చోటికి బదిలీ చేయడం సహజం. కానీ కాంట్రాక్టు లెక్చరర్ల విషయంలో ఈ పద్ధతి పాటించలేదు. ఐదు నుంచి పదేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న వారికి అదే కళాశాలలో పోస్టింగ్ ఇచ్చారు. ఇది ఏడాది క్రితం జరిగిందే అయినా ప్రభుత్వ సీనియర్ లెక్చరర్ల బదిలీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గతేడాది రెగ్యులరైజ్ అయిన జూనియర్ లెక్చరర్లు స్థానికంగా విధులు నిర్వహిస్తుండగా.. నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీనియర్ లెక్చరర్లు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. మరో పక్క జిల్లాకు మంజూరైన కొత్త కళాశాలలకు పోస్టులు మంజూరు చేయకపోవడంతో ఆ కళాశాలలు కూడా పోస్టులు ఖాళీగానే ఉండనున్నాయి. జిల్లాలో 84 జూనియర్ కళాశాలలు ఉండగా ఇందులో 12ప్రభుత్వ, 15ప్రైవేట్, 57 గురుకుల, మోడల్, కేజీబీవీ కాలేజీలున్నాయి.

నాలుగేళ్లు పూర్తి కానందున

ఏడాది క్రితం రెగ్యులరైజేషన్ అయిన లెక్చరర్లు అదే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఐదు నుంచి పదేళ్లు అక్కడే పని చేస్తున్నా రెగ్యులరైజేషన్ అయిన నాటి నుంచి లెక్కిస్తే మాత్రం రెండో సంవత్సరం అవుతుంది. ఈ కారణంగా వారిని బదిలీ చేసే అవకాశం లేకుండా పోయింది. వెబ్ ఆప్షన్ పెట్టుకునే అవకాశం కూడా వారికి ఉండదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 20 నుంచి 25 సంవత్సరాల సీనియారిటీ ఉన్న లెక్చరర్లు ఒకేచోట నాలుగేళ్లు విధులు నిర్వహించడంతో వారికి బదిలీ తప్పని సరి అయ్యింది. ప్రస్తుతం జిల్లాలో ఖాళీలు లేకుండా పోయాయి. వీరు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితి ఇంతటితో ఆగకుండా ప్రతి నాలుగు సంవత్సరాల కోసం జరిగే బదిలీల సమయంలో సీనియర్లకు అన్యాయం జరుగుతోందని వారు వాపోతున్నారు.

కళాశాలల మంజూరుతో సరి

గతేడాది జిల్లాలో కొత్తగా మూడు (దుద్యాల, బొంరాస్‌పేట్, బషీరాబాద్) జూనియర్ కళాశాలలను ప్రారంభించారు. ఒక్కో కళాశాలకు 11 చొప్పున 33 పోస్టులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ నేటికీ మంజూరు కాలేదు. దీంతో పక్క కళాశాలల నుంచి ఒకరిద్దరిని డెప్యుటేషన్ వేసి నెట్టుకొస్తున్నారు. గతేడాది లెక్చరర్లు లేకపోవడంతో దుద్యాల జూనియర్ కళాశాలలో 11 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్ తీసుకోగా అందులో ఒక్కరు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. లెక్చరర్లు లేక, పోస్టులు మంజూరు కాక ఆ కళాశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. కొత్త కళాశాలల మంజూరు చేయించామని గొప్పలు చెప్పుకున్న నేతలు పోస్టుల మంజూరు, వసతులు కల్పించడంపై దృష్టి సారించడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో విద్య కుంటుపడుతోంది. ఖాళీలు భర్తీ చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

నూతన ఆవిష్కరణలకు 'ఇంటింటా ఇన్నోవేటర్'

ఇబ్రహీంపట్నం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇచ్చే ప్రదర్శనలు కొత్త తరహాలో ఉండేలా చూడాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లోనూ ఈ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పరిధిలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు నూతన ఆవిష్కరణలతో తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. ఆసక్తిగల వారు ఆవిష్కరణ పేరు ప్రదర్శనకు సంబంధించి రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు. వంద పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబరు 9100678543కు పంపాలని సూచించారు. పేరు, వయస్సు ఫొటో, వృత్తి, గ్రామం తదితర వివరాలతో ఆగస్టు 3లోగా వాట్సాప్ చేయాలన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీత, పీడీ డీఆర్‌డీఏ శ్రీలత, డీపీఓ సురేశ్‌మోహన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ ఇన్నోవేషన్ కోఆర్డినేటర్ కొబ్బన్న వాసు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన సీఎస్ శాంతకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఏజీ ఆడిట్



ఆడిట్ చేస్తున్న అధికారులు

పెద్దేముల్: అకౌంటెంట్ జనరల్ అధికారుల ఆధ్వర్యంలో 2014–15 నుంచి 2022–23 ఏడాది సంబంధించి జనరల్ ఆడిట్ ప్రారంభం అయిందని సీనియర్ ఆడిటర్ టి.అరుణ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రకాల రికార్డుల ఆడిట్ జరిగిందని ఆమె చెప్పారు. మరో ఐదు రోజుల పాటు మండల పరిధి జనగాం, మంబాపూర్, కందనెల్లి, పెద్దేముల్, తట్టెపల్లి, నాగులపల్లి మేజర్ జీపీల్లో లెక్కలు జరగనున్నాయని అరుణ పేర్కొన్నారు. ఆడిట్‌లో ఎంపీడీఓ జర్నప్ప, హైదరాబాద్ ఏజీ బృందం పాల్గొంది.

ఢిల్లీలో.. తెలంగాణ 'డిల్లెం'



ఇండియా గేటు వద్ద ఒగ్గుడోలు బృందం

బొంరాస్‌పేట: దేశ రాజధాని హస్తినలో తెలంగాణ ఒగ్గు కళాకారుల డిల్లెం క్లోం మోగింది. ఈ నెల 9,10న న్యూఢిల్లీలో జరిగే బోనాల ఉత్సవాలకు రాష్ట్రం నుంచి మండల పరిధి నాందార్‌పూర్‌కు చెందిన మల్లికార్జున ఒగ్గుడోలు బృందం సభ్యులు 20మంది వెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం ఇండియా గేటు వద్ద ప్రదర్శన నిర్వహించారు. బుధవారం తెలంగాణ భవన్ వద్ద ఒగ్గుడోలు ప్రదర్శన మరింత అలరించనుందని ఆ బృందం అధ్యక్షుడు ఒగ్గుబీరు తెలిపారు. ప్రదర్శనలో శివ, రాఘవేందర్, మల్లేశ్, భద్రయ్య ఉన్నారు.

కొలువుదీరిన పీర్లు



దుద్యాల్ మసీదులో కొలువైన పీర్లు

దుద్యాల్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన మొహర్రం పండుగా రానే వచ్చింది. మంగళవారం నుంచి ప్రారంభమయింది. మండలం కేంద్రంతో పాటు హస్నాబాద్ తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి మసీదుల్లో పీర్లు కొలువుదీరాయి. పది రోజుల పాటు ప్రార్థనలు చేస్తూ ముస్లింలు భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకోగా.. వారి కంటే ఎక్కువగా ముస్లిమే తరులు నిర్వహిస్తారు. కుల, మతాలకతీతంగా అందరూ పాల్గొని, పీర్ల వద్ద ప్రత్యేక పూజలు, ఊదు, బెల్లం చదివింపులు జరుపుతారు. 10వ రోజున తెల్లవారు జామున పీర్లు మజీద్ నుంచి వెలుపలకు తీస్తారు. హసన్, హుసేన్‌ల వీరోచిత పోరాట త్యాగాన్ని గుర్తుకు చేసుకుంటూ.. పీర్లను ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తారు. ఈ సమయంతో పీర్లను ప్రతి ఇంటి ముందు ఆపుతారు. బిందెలతో నీటిని తీసుకొచ్చి పీర్లు ఎత్తుకున్న వారి పాదాల మీద పోస్తారు. దీవెనలు పొందుతారు. ఈ సందర్భంగా పీర్ల చావిడి వద్ద అలయ్ గుంతలను తవ్వి, చిన్నా పెద్దలు ఆటపాటలు ఆడతారు.

గుట్కా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

బంట్వారం: నిషేధించిన గుట్కా తయారీ కేంద్రంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. గుట్కా ప్యాకెట్లు, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి ఓగులాపూర్ సమీపంలోని ఓ షెడ్డులో గుట్కా తయారీ కేంద్రం కొనసాగుతుందన్న సమాచారం మేరకు పోలీసులు ఆ కేంద్రంపై దాడి చేశారు. ఈ సోదాలో గుట్కా ప్యాకెట్ల బస్తాలు, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు మహ్మద్ అబ్దుల్ ఖరీంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్రవంతి తెలిపారు.

వ్యవసాయం మరింత పిరం

- తగ్గిన పశుసంపద
- గుంటుక తోలేందుకు పెరిగిన కాడెడ్ల అద్దె ధర



పత్తిలో గుంటుక తోలుతున్న రైతు

మోమిన్‌పేట: వ్యవసాయ పనులు చేపట్టాలంటే.. రైతు నేస్తాలైన కాడెడ్లు తప్పనిసరి. కానీ.. వాటి పోషణ భారంగా మారడంతో అన్నదాతలు క్రమంగా వాటిని దూరం చేసుకుంటున్నారు. తొందరగా పనులు అవుతాయంటూ యంత్రాలతో సాగు పనులు ముమ్మరం చేస్తున్నారు. ట్రాక్టర్లతో వేసవి కాలంలో మాత్రమే దుక్కులు దున్నడం, రోటవేటరు వేయడం, పత్తిని విత్తుకునేందుకు సాలు ఏర్పాటు చేసుకోవడం తదితర పనులను చేస్తున్నారు. కానీ పత్తిలో కలుపు తీసేందుకు గుంటుకను తోలాలంటే కాడెడ్లు కావాల్సిందే. అలాంటి ఎడ్లు ఇప్పుడు చాలా పిరంగా మారాయి. ఒకప్పుడు ప్రతి రైతు వద్ద పశు సంపద చాలా ఉండేది. రాను రాను ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై.. చిన్న కుటుంబాలు ఏర్పడటం, చదువు పేరుతో పిల్లలను ఇతర ప్రాంతాల్లో ఉంచుతున్నారు. ప్రస్తుతం భార్య భర్త మాత్రమే సాగు పనుల్లో ఉండటం వలన పశు పోషణ కష్టంగా, భారంగా మారింది. దీంతో కాడెడ్ల కొరత ఏర్పడింది.

కొనడం సరే.. సాకడమే..

వర్షాకాలంలో పత్తిలో గుంటుకను తోలేందుకు ఎడ్లు అవసరం కావడంతో రోజు వారి అద్దె అమాంతం పెరిగిపోయింది. ఎకరాకు రూ.1000 ఇస్తే కాని గుంటుక కొట్టే ప్రసక్తి లేదు. దీనికి తోడు సాగు పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఎడ్ల వినియోగం తప్పని సరి కావడంతో అవి కలిగిన రైతులకు ఆదాయం దండీగానే వస్తుంది. రెండు నెలల పాటు గిరాకీ ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. రూ.1లక్షకు పైగా వెచ్చిస్తే రెండు ఎడ్లు రాని పిరిస్థితులు ఉన్నాయని తెలిపారు. వాటిని కొనడం ఇబ్బంది లేదు. పోషణే ఖరీదుగా మారిందంటున్నారు.

నాలుగు సార్లు తోలాలి



పత్తి సాగులో కనీసం మూడు నుంచి నాలుగు సార్లు గుంటుకను తోలాలి. ఎకరాకు రూ.వెయ్యి అద్దె చెల్లించాల్సి వస్తోంది. రెండు నెలలు మాత్రమే గిరాకి ఉంటుంది. వేసవిలో పూర్తిగా ట్రాక్టరు ద్వారానే దుక్కులు దున్నడం, రోటవేటరు వేసుకోవటం, పత్తిని విత్తుకునేందుకు సాళ్లు చేసుకుంటాం.

– ప్రభాకర్‌రెడ్డి, రైతు, ఎన్కేపల్లి

రూ.1.40లక్షలతో ఎడ్లు



నాకు రెండు ఎకరాల భూమి ఉంది. మరో 8 ఎకరాలను కౌలుకు తీసుకున్నా. పత్తి పంటను సాగు చేస్తున్నా. ఎడ్లు తప్పని సరి కావడంతో రూ.1.40లక్షలు వెచ్చించి జత కొనుగోలు చేశాను. నా వ్యవసాయ పనులతో పాటు.. అద్దె రూపేణా ఇతరులకు గుంటుక కొడుతుంటా.

–ఆనందం, రైతు, ఎన్కేపల్లి

కల్లు కాంపౌండ్‌గా మార్కెట్ యార్డు!

పరిగి: మార్కెట్ యార్డు గోడాములు కల్లు కాంపౌండ్‌గా మారాయి. పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డుకు అనుకుని కల్లు కంపౌండ్ ఉంది. దీంతో మందు బాబులు గిడ్డంగులను అడ్డాగా చేసుకుని, నిత్యం మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఇక్కడే నిర్వహించారు. దీంతో ఎన్నికల అధికారులు గోదాంకు కంపౌండ్‌వాల్ నిర్మించి, కంచె ఏర్పాటు చేశారు. అయినప్పటికీ.. మందుబాబులు గోదాంలను వినియోగిస్తూ.. ఇష్టంగా వ్యవహరిస్తున్నారు. గొడవలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ.. పక్కనే ఉన్న మార్కెట్ అధికారులు చూసి



మార్కెట్ యార్డు గోదాంలో కల్లు ట్రేలు

చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పరిసర ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మేకల అపహరణ

కుల్కచర్ల: గుర్తు తెలియని దుండగులు 15మేకలను అపహరించిన సంఘటన మండల పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్లాపూర్ గ్రామానికి చెందిన దానగళ్ల రాములు రోజులాగే కొట్టంలో 35 మేకలను తోలి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా.. మందలోని మేకలను దొంగలు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించాడు. జీవనాధారమైన జీవాలు చోరీ అయ్యాయని, వాటి విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని, తనను ఆదుకోవాలని రాములు కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

ఊరెళితే సమాచారం ఇవ్వండి



ఆటోతో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొడంగల్ రూరల్: అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆగడాలు పెరుగుతున్న నేపథ్యంలో.. ఎవరైనా ఊరెళితే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు కాలనీల్లో ఆటోతో ఆయన ప్రచారం చేశారు. సమాచారం ఇచ్చినట్లయితే రాత్రి వేళల్లో ఆ పరిసర ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తాళాలు పగలగొట్టి సొత్తు, సొమ్మును అపహరిస్తున్నారని, ఆ సమయంలో ఇంట్లో నగదు, బంగారం లేకుండా చూసుకోవాలని వెల్లడించారు. దొంగతనాలను అరికట్టడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అపరిచితులు తిరిగినట్లయితే సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగల ముఠాను పట్టుకోవడానికి యువకులు, ప్రజలు సహకరించాలన్నారు.

డెంగీతో బాలుడు మృతి



బాలుడి మృతికి నిరసనగా ఆందోళన వ్యక్తంచేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు

చేవెళ్ల: డెంగీ బారిన పడిన తమ బిడ్డ వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఇందుకు యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని చనువెల్లికి చెందిన కుర్వ శ్రీనివాస్, సంతోష దంపతులకు మునీశ్వర్(11), వర్షిత్ ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో పట్నం ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. వైద్య పరీక్షల అనంతరం డెంగీ జ్వరంగా నిర్ధారించిన వైద్యులు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందించారు. సోమవారం సాయంత్రం వచ్చిన వైద్యులు ఇద్దరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని, మంగళవారం డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. సోమవారం రాత్రి రెండు ఇంజక్షన్లు ఇచ్చిన తర్వాత పడుకున్న మునీశ్వర్ ఉదయం వరకూ లేవలేదు. నిద్రలో ఫిట్స్ రావడం, వాంతులు కావడంతో ఊపిరితిత్తుల్లోకి నీరు చేరి బాలుడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఇది విన్న బాధిత కుటుంబ సభ్యులు ఇంజెక్షన్లు వికటించడం వలనే తమ కుమారుడు మృతి చెందాడని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఆస్పత్రి చైర్మన్ పట్నం మహేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి రూ.6 లక్షలు ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.

'పట్నం' ఆస్పత్రిలో ఘటన

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల ఆందోళన
- నాలుగు రోజులుగా డెంగీ చికిత్స పొందిన మునీశ్వర్



మునీశ్వర్ (ఫైల్)

వైద్యుల నిర్లక్ష్యం లేదు

బాలుడు మృతి చెందడంలో వైద్యుల నిర్లక్ష్యం ఎక్కడా లేదు. డెంగీ ఫీవర్‌తో వచ్చిన ఇద్దరు బాలురకు ఒకే రకమైన ట్రీట్‌మెంట్ అందించాం. మూడు రోజుల పాటు అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, వైద్యం అందించాం. నిద్రలోనే బాలుడికి ఫిట్స్ రావడంతో పరిస్థితి విషమించింది. డెంగీ ఫీవర్‌కు అన్ని ఆస్పత్రిలో అందించినట్లుగానే వైద్యం చేశాం. వైరస్ పరిస్థితిని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. బాలుడి మృతి చెందిన బాధలో కుటుంబ సభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. అంతేకాని ఇందులో ఆస్పత్రి నిర్లక్ష్యం లేదు.

– రామకృష్ణారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

గ్రామకంఠం భూమి స్వాధీనం

- తనభూమేనంటూ రైతు ఆత్మహత్యాయత్నం
- నిలువరించిన పోలీసులు



స్థలం స్వాధీనం చేసుకుంటున్న జీపీ సిబ్బంది

ధారూరు: గ్రామ కంఠం భూమిని ఆక్రమించి ఓ రైతు షెడ్డు వేయగా.. పోలీసుల సహాయంతో పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు వెళ్లారు. ఇగి గమనించిన సదరు వ్యక్తి స్థలం నాదేనంటూ ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కేరెల్లి గ్రామం సమీపంలోని తాండూరు–హైదరాబాద్ ప్రధాన రోడ్డు పక్కనే సర్వే నంబర్ 139లో 93 గజాల స్థలాన్ని రెవన్యూ అధికారులు సర్వేచేసి గ్రామ కంఠంగా నిర్ధారించారు. ఆ స్థలాన్ని ఎంపీడీఓ నర్సింహులు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వెళ్లారు.

గడ్డిమందు డబ్బాతో హల్‌చల్

విషయం తెలుసుకున్న రైతు గోపాల్.. ఆ స్థలం గ్రామ కంఠం కాదని, పట్టాపొలం అని కుటుంబ సభ్యులతో కలిసి అధికారులతో వాగ్వివాదానికి దిగారు. స్థలం స్వాధీనం చేసుకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ గోపాల్ గడ్డిమందు డబ్బా చేతిలోకి తీసుకున్నాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని నిలువరించి, అదుపులోకి తీసుకున్నారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు అధికారులతో ఘర్షణకు దిగారు. పరిస్థితిని గమనించిన సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌లు వెంటనే పోలీసు బలగాలను రప్పించారు. వారి ఆధ్వర్యంలో గ్రామ కంఠ స్థలాన్ని స్వాధిన పరుచుకున్నారు. కడీలు పాతి, హద్దులు నిర్ణయించారు.

ఆరోపణలు చేసినవారిపై చర్యలకు డిమాండ్

మర్పల్లి: కోటమర్పల్లి గ్రామంలో మద్యం అమ్మకాలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేసిన వారిపై కేసు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని క్రిస్టియన్ మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రయ్య అలియాస్ ఏలియా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మోమిన్‌పేట సీఐ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. ఇందులో రాష్ట్ర ఉపకులాల అధ్యక్షుడు అనంత్‌రామ్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు అంజయ్య, నాయకులు జలీల్, నర్సింలు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

పకడ్బందీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి

అవసరం ఉన్న చోట మొక్కలు నాటండి: కలెక్టర్

అనంతగిరి: అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసి, అవకాశం ఉన్న ప్రతి చోట మొక్కలు నాటాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎస్ శాంతికుమారి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో వనమహోత్సవం కింద మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని, బదిలీల ప్రక్రియలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. వీసీలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యానాయక్, డీఆర్డీఏ శ్రీనివాసులు, ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్, డీఈఓ రేణుకా దేవి, వ్యవసాయ అధికారి గోపాల్, డీపీఓ జయసుధ, పంచాయత్ రాజ్ ఈఈ ఉమేష్ పాల్గొన్నారు.

డేంజర్ జర్నీ

28 విద్యార్థులతో పరుగులు తీసిన ఆటో



28 మంది విద్యార్థులతో పరుగెడుతున్న ఆటో



విద్యార్థులను ఆటోలో ఎక్కిస్తున్న ఆటో డ్రైవర్

తాండూరు: విద్యా సంస్థలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా అధికార యంత్రాంగం విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రోడ్డు ప్రమాదంలో రెండు రోజుల క్రితమే ఓ విద్యార్థి మృతి చెందిన విషయం విదితమే. అయినా పోలీసు, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. తాండూరు మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన 7 సీటర్ ఆటోలో పట్టణం నుంచి 28 మంది విద్యార్థులను (ఆటోపైన క్వింటాళ్ల బరువున్న సామగ్రి ఉంది) ఎక్కించి, వారివారి గమ్యస్థానాలకు తరలించాడు. ఇంత మందిని కిక్కిరిసి కూర్చోబెట్టి తరలించడాన్ని చూసిన పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే పిల్లల ప్రాణాలు ఏంగాను అని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించి కెపాసిటికి మించి ప్యాసింజర్స్‌ను తరలిస్తున్న ఆటో, ఇతర వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గల్లికో గ్రామదేవత.. ఊరంతా భక్తులు

- నూతనంగా లక్ష్మమ్మ, పోచమ్మ, కాటమయ్య ఆలయాల నిర్మాణం
- ఆషాఢం బోనాలు, ప్రత్యేక పూజలకు సిద్ధం
- దైవభక్తి చాటుకుంటున్న దాతలు, గ్రామస్తులు



కాటమయ్య ఆలయానికి బోనాలతో వెళ్తున్న గౌడ కులస్తులు

బొంరాస్‌పేట: మైలారం అంటేనే మాతృస్వామ్య వ్యవస్థను గౌరవించే గ్రామం. అందుకేనేమో గల్లీకో గ్రామదేవత వెలసి, ఊరంతా భక్తులు కలిగి ఉన్నారు. మండల పరిధి రేగడిమైలారంలో ఏటా గ్రామ దేవతల పూజలకు, పండుగలు చేస్తుంటారు. వీధినాటకాలాడినా, భజనలు చేసినా అన్నీ దేవతలవే ఉంటాయి. ఆషాఢ మాసంలో బోనాలు, పూజలు చేయడం ఇక్కడి ఆనవాయితీ. అందుకే నాటి నుంచి అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. కుల, మతాలకు అతీతంగా ఇక్కడి ప్రజలు పండుగలు, పూజలు చేస్తుంటారు.

దేవతలు.. దాతలు

ఊరుకాసే ఊరడమ్మ, పొలిమేర కాసే పోతురాజు, మహిమలు చూపే మైసమ్మ, రోగాలుమాపే ఎల్లమ్మ, పోచమ్మలు, సంపదలిచ్చే లక్ష్మమ్మ ఇలా ఈ ఊర్లో అన్ని దేవతలను పూజిస్తుంటారు. రాతిబొమ్మలు, కర్రబొమ్మలు ప్రతిష్టించి పూజిస్తుండగా.. బండల లక్ష్మమ్మ గుడి నిర్మాణం కోసం ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు రూ.4లక్షలు విరాళంగా ఇచ్చారు. అదే విధంగా జాతీయ రహదారి పక్కనే కొనసాగుతున్న పోచమ్మ గుడి నిర్మాణానికి పలువురు దాతలు ముందుకు వచ్చారు.

ఆషాఢం బోనాలు

ఆషాఢ మాసం కావడంతో ఆలయాల ప్రారంభం, బోనాలు, ప్రత్యేక పూజలకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. ఈ నెల12న బండల లక్ష్మమ్మ ఆలయ ప్రారంభోత్సవం, జల్దీ, బోనాలు, అన్నదానం కార్యక్రమాలు చేపట్టనున్నారు. 19న పోచమ్మకు బోనాలు సమర్పించనున్నారు.

కాటమయ్యకు పూజలు

గౌడకులస్తులు కాటమయ్య గుడిని నిర్మించుకున్నారు. సోమవారం ఘనంగా నిర్వహించారు. శివసత్తుల శూనకాలు, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు.

గుడి,బడి ఒక్కటే



ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పటి నుంచి దేవాలయం, విద్యాలయం ఒక్కటనే భావించాను. సిరి సంపదలిచ్చే లక్ష్మిదేవిగా అమ్మవారిని నమ్మాను. పురాతన దేవి ఆలయ పునర్నిర్మాణానికి తన వంతు సాయం చేసి, భక్తిభావం చాటుకున్నాను.

– అనంతయ్య, విశ్రాత ఉపాధ్యాయుడు, రేగడిమైలారం

దైవభక్తి చాటుకునేందుకు



గ్రామదేవతలను పూజించేవారు ఇంటింటికీ ఉన్నారు. దైవభక్తి చాటుకునేందుకు దాతలు, గ్రామస్తులు ఆలయాల నిర్మాణం కోసం సహకరిస్తున్నారు. ఆషాఢం బోనాలు, కాటమయ్య నూతన గుడి ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నాం. దైవభక్తి, సహాయ గుణం ఉన్న వారికి దేవతల అనుగ్రహం ఉంటుంది.

– శ్యామలయ్యగౌడ్, పోతురాజు, రేగడిమైలారం